క్లుప్తంగా

శ్రీకృష్ణాపురంలో వారపు సంత

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ మధ్య బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో ఆదివారం పలువురు వ్యాపారులు వారపు సంత నిర్వహించారు. శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్ వాసులకు అందుబాటులో ఉండేలా ఈ సంత నిర్వహిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ప్రతి ఆదివారం ఇక్కడ సంత నిర్వహిస్తామన్నారు. కూరగాయలతో పాటు ప్లాస్టిక్ సామాన్లు, పిల్లల ఆట బొమ్మలు విక్రయించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'పక్కాగా సినిమాటోగ్రఫీ చట్టం అమలు'

మద్దిలపాలెం: నగరంలో సినిమాటోగ్రఫీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సెన్సార్ బోర్డు సలహా మండలి పూర్వపు సభ్యుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో కోరారు. 1952 సెక్షన్ 4 నుంచి 7, 12, 13 ప్రకారం ఏ-సర్టిఫికెట్ పొందిన చిత్రాలను నగరంలో కొన్ని థియేటర్లలో ప్రదర్శిస్తున్నారన్నారు. అటువంటి సినిమాలకు 18 ఏళ్లలోపు బాలలకు అనుమతి లేదన్నారు. అయితే ఈ నిబంధనలను పలు థియేటర్ల యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని పేర్కొన్నారు.

టైలర్‌కు ఆర్థిక సహాయం



వీర్రాజుకు సహాయం అందిస్తున్న టైలర్స్ అసోసియేషన్ సభ్యులు

మద్దిలపాలెం : ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన మద్దిలపాలెంకు చెందిన టైలర్ వీర్రాజు కుటుంబానికి సంపత్ వినాయక టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.6 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం వీర్రాజు ఇంటికి అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.త్రినాథ్, తదితరులు వెళ్లి చేదోడు, వాదోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికిన శెట్టి సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరరావు, వివేకానంద, గంగరాజు, ఆరిలోవ టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీరాములు, శ్రీనివాస్, బేతరాజు, వెంకటరమణ, వెంకటరావు, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

లలితా పీఠంలో పాశుర విన్నపం



పాశుర విన్నపం చేస్తున్న అర్చకుడు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం 9వ రోజు పాశుర విన్నపం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పాశురాలు చదివారు. ఈ సందర్భంగా గోదా దేవికి పంచామృతాభిషేకం, వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన జరిపారు. జనవరి 3న సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

ప్రైవేటీకరణకు కార్మికులు వ్యతిరేకం

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కార్మికులంతా వ్యతిరేకిస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం జరుగుతున్న 1046వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును అమ్మాలని చూడడం అన్యాయమని, దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

స్మార్ట్ ల్యాబ్స్

ఇది కదా అభివృద్ధి

- విమ్స్‌లో జనరల్ డ్రగ్ స్టోర్స్, సీటీ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు
- తుది దశకు భవన నిర్మాణ పనులు



విమ్స్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న రీజనల్ డ్రగ్ సెంటర్

ఆరిలోవ : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే నగరంతో పాటు తూర్పు నియోజకవర్గంలో పలుచోట్ల వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల(యూపీహెచ్‌సీ)ను రూ.కోట్లు ఖర్చు చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు తాజాగా విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో రీజనల్ డ్రగ్ స్టోర్స్, సీటీ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇవి పూర్తయితే ఆధునిక పద్ధతిలో తక్కువ ధరకు అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. విమ్స్ ఆవరణలో బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన రీజనల్ డ్రగ్ స్టోర్స్, సీటీ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మాణాలు కోసం సుమారు అరెకరం స్థలం కేటాయించారు. రూ.20 కోట్ల నిధులతో చేపడుతున్న ఈ భవనాల పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయి. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. అవసరమైన పరికరాలు, యంత్రాలు తీసుకువచ్చి ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రేలు తీయడానికి రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్న ఈ ల్యాబ్‌ల వల్ల రోగులకు కొంత వైద్య ఖర్చులు తగ్గనున్నాయి. రీజనల్ డ్రగ్ స్టోర్స్ నాలుగు జిల్లాలకు కేంద్రంగా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు ఇది కేంద్రంగా మారనుంది.



సీటీ డయాగ్నోస్టిక్ సెంటర్ భవనం

అందుబాటులోకి రానున్న సేవలు

సీటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో రేడియాలజీ విభాగంలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, యూఎస్‌జీ రూంలు ఉంటాయి. రేడియోలజీ ఎక్స్‌రే రూంలు, శాంపిల్ కలెక్షన్ గదులు, డాక్టర్ చాంబర్లు, వైరాలజీ ల్యాబ్(బీఎస్ఎల్-2 లెవెల్స్) మైక్రో బయోలజీ ల్యాబ్స్, పాతాలజీ ల్యాబ్స్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్, బయో కెమిస్ట్రీ ల్యాబ్, సెంట్రల్ రీసెర్చి ల్యాబ్స్ సిద్ధం చేస్తున్నారు.

➡ రీజనల్ డ్రగ్ స్టోర్‌లో ఫార్మాసిస్టులు, డాక్టర్లు, ప్రత్యేక గదులు, బయో మెడికల్ ఇంజనీరు రూం, వర్క్‌షాప్, కంప్యూటర్ గది, ఎలక్ట్రికల్ రూం, ఆఫీస్ ఏరియా, శాంపిల్ రూం, వాక్ ఇన్ కోల్డ్ రూం, కోల్డ్ స్టోరేజ్-1, 2, మీటింగ్ హాల్, రికార్డ్ రూం, ఆఫీస్ స్టాఫ్ రూం, అకామిడేషన్ రూం, రెస్ట్ రూం సిద్ధం చేస్తున్నారు.

భవనాలు సిద్ధమవుతున్నాయి..

విమ్స్ ఆవరణలో రీజనల్ డ్రగ్ స్టోర్స్, సీటీ డయాగ్నోస్టిక్ సెంటర్ భవనాలు సిద్ధమవుతున్నాయి. పనులు తుది దశలో ఉన్నాయి. ఎక్విప్‌మెంట్ ఇంకా తీసుకురావాల్సి ఉంది. ఇవి వినియోగంలోకి వస్తే రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఇక్కడ అందుబాటులోకి వస్తాయి. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న రీజనల్ డ్రగ్ స్టోర్స్ పలు జిల్లాలకు కేంద్రంగా సిద్ధం చేస్తున్నాం.

– డి.ఎ.నాయుడు, ఏపీఎంఎస్ఐడీసీ, ఈఈ

సంక్షేమ పథకాల అమలుతో ఎంతో మేలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- 13వ వార్డులో ముగిసిన పాదయాత్ర



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 13వ వార్డులో ఎంవీవీ వారం రోజుల క్రితం చేపట్టిన పాదయాత్ర ఆదివారం ముగిసింది. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. ముగింపు రోజు వార్డులోని ఏఎస్ఆర్ నగర్, దుర్గాబజార్‌లలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, మహిళలు, యువకులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. వాటి వల్ల కలిగే లబ్ధి ఏవిధంగా ఉపయోగపడుతుందో ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలు పొంది ఆర్థిక అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, శిరీష, సాగరిక, వరలక్ష్మి, సచివాలయాల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ద్వాదశి ప్రత్యేక పూజలు



కొత్త వెంకోజీపాలెంలో శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పల్లకి సేవ

ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

మద్దిలపాలెం : ముక్కోటి ద్వాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉత్తర ద్వార దర్శనం కోసం వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గోవింద నామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. శ్రీవిష్ణువుకు ప్రీతి పాత్రమైన రోజున శ్రీవారి దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలించారు. ఎంఎంటీసీ కాలనీలోని శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరచార్య మహా సంస్థాన్ శ్రీ త్రిమూర్తిక ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి స్వామివారి దర్శనం కల్పించారు. కొత్త వెంకోజీపాలెంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



రోలాండ్ విలియమ్స్‌ను సత్కరిస్తున్న అధ్యక్షుడు రవీంద్ర

బీచ్ రోడ్డు: ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తమ విస్తృత సేవా కార్యక్రమాల ద్వారా ఆధునిక సమాజ నిర్మాణ దిశా నిర్దేశకులుగా వాకర్స్ ఎదగాలని అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర పిలుపునిచ్చారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ మహా సమ్మేళనం ముగింపు సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు అమెరికా దేశం నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. 2 వేల మంది ప్రతినిధులతో 2 రోజుల పాటు ఘనంగా నిర్వహించామన్నారు. ముగింపులో భాగంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్కే బీచ్ వద్ద నడక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కన్వెన్షన్ చైర్మన్ రోలాండ్ విలియమ్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కమల్ బైడ్, ఎ.ఎస్.ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే పెన్షన్ సాధన



సనపల బంగారురాజును సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు

మర్రిపాలెం: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెన్షనర్లు రోడ్డున పడుతున్నారని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మసేను అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన ఆదివారం మాధవధార తోటల్లో సర్వసభ్య సమావేశం, వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్టు బెర్తులను ముక్కలుగా చేసి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం యోచిస్తోందని, తక్షణమే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పింఛన్‌దారులకు కూడా భవిష్యత్తులో పెన్షన్ లేకుండా చేసేందుకు పోర్టు యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. అందరూ కలిసి కట్టుగా ఉంటేనే పెన్షన్‌ను సాధించుకోవచ్చన్నారు. పోర్టు ఆస్పత్రి స్థలాన్ని కార్పొరేట్ శక్తులకు చౌకగా అమ్మేస్తున్నారని, దీని వల్ల వైద్యం కార్పొరేట్ శక్తుల చేతికి వెళ్లి తద్వారా పింఛన్‌దారులపై భారం పడుతుందని చెప్పారు. పెన్షనర్లు వీటిని వ్యతిరేకించాలన్నారు. అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు నారాయణరావు, కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'అపూర్వ' కలయిక



ముడసర్లోవ పార్కులో ఎన్‌ఎంసీహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆరిలోవ: నగరంలో ఎన్‌ఎంసీహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ముడసర్లోవ పార్కులో కలుసుకుని సరదాగా గడపుతూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటరమణ, సత్యనారాయణ, శ్రీను, సూర్యప్రకాష్, నితిన్, నర్సింహమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలపై అవగాహన

సీతంపేట: అక్కయ్యపాలెం అబిద్‌నగర్ పార్కులో ఆదివారం ఉదయం నెఫ్రాలజీ, యూరాలజీ అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ వైద్యులు ఉదయ్, రవీంద్రవర్మ, మేనేజర్ పృథ్వీనాయుడు నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలు ఏవిధంగా ఉంటాయి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అబిద్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎస్.వి.ఆర్.ప్రసాద్, జె.ఖాన్, ఎం.వెంకటరావు, వాకర్స్ పాల్గొన్నారు.

ముగిసిన కళాభారతి నృత్యోత్సవాలు



జానపద నృత్య వైభవంలో కళాకారుల నాట్య విన్యాసాలు

- ఆకట్టుకున్న 60 మంది జానపద కళాకారుల నృత్య వైభవం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల నృత్యోత్సవాలలో భాగంగా ఆఖరి రోజు ఆదివారం ప్రదర్శించిన జానపద నృత్య వైభవం అందరిని కట్టిపడేసింది. నవ చైతన్య కళా సమితి నుంచి 60 మంది జానపద కళాకారులు పలు నృత్య రీతులను 90 నిమిషాల పాటు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ సుసర్ల రామ గోపాల్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మూడు రోజుల నృత్యోత్సవాలకు ఎస్ఆర్‌కే ఇన్‌ఫ్రా ప్రాజెక్టు అధినేత మంతెన సత్యనారాయణరాజు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారని వీఎండీఏ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు తెలిపారు.

కొనసాగుతున్న మార్గశిర పూజలు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 11వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్‌కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన క్లాసికల్ డ్యాన్స్

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ డ్యాన్స్ అకాడమీకి చెందిన కె. మోహనకుమారిచే నిర్వహించిన క్లాసికల్ డ్యాన్స్ భక్తులను అలరించింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నగరానికి చెందిన లలిత డ్యాన్స్ అకాడమీచే కూచిపూడి నృత్యం ఏర్పాటు చేసినట్టు ఈవో శిరీష తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



గ్రేప్ స్టాంపింగ్ చేస్తున్న యువతులు

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులోని నొవోటల్‌లో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హోటల్‌లోని అతిథులతో పాటు నగరవాసుల మధ్య క్రిస్మస్ నృత్య ప్రదర్శన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా వరుణ్ గ్రూప్ డైరెక్టర్ వరుణ్ మాట్లాడుతూ హోటల్‌కు వచ్చే అతిథులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు క్రిస్మస్ ట్రీ, శాంతా క్లాస్, సంప్రదాయ నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశామన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన గ్రేప్ స్టాంపింగ్(ద్రాక్ష నుంచి జూస్ తీయడం)లో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ద్రాక్ష పండ్లను కాళ్లతో తొక్కి జూస్ తీశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని గోపాలపట్నంకు చెందిన ఎస్. యామినిరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు.

క్రికెట్, త్రోబాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాష్, నిఖిలేష్ రాజ్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి గ్రౌండ్‌లో సెయింట్ మదర్ థెరిస్సా మెమోరియల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ పేరిట వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సీనియర్ నాయకుడు యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్–త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌సీఎం విశాఖ చాన్స్‌లర్, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ పోస్టర్ ఆవిష్కరించారు. జనవరి 28 వరకు జరిగే పోటీల్లో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని సుమారు 22 చర్చిలు, 25 విద్యా సంస్థల క్రీడాకారులు పాల్గొంటారని ఫాదర్లు శివం విజయభాస్కర్, ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు ఫాతిమారాణి, సీహెచ్ విజయకుమార్, బి.ప్రసాద్ పాల్గొన్నారు

ఉత్సాహంగా ట్రెకింగ్

సింహాచలం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ సిటీ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం మాధవధార నుంచి సింహగిరికి నిర్వహించిన ట్రెకింగ్ ఉత్సాహంగా సాగింది. ఉదయం 7గంటలకు మాధవస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ట్రెకింగ్ 10 గంటలకు సింహగిరిపై ముగిసింది. పెద్దలు, పిల్లలతో కలిపి మొత్తం 70 మంది పాల్గొన్నారు. యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ సిటీ యూనిట్ చైర్మన్ ఎస్ఆర్‌పీ మోహన్, అధ్యక్షుడు ఎ.పుండరీకాక్ష, ఉపాధ్యక్షుడు పీఎస్ఎన్.రెడ్డి, కార్యదర్శి కేవీఈ ప్రసాద్, కోశాధికారి జి.రాజు తదితరులు పాల్గొన్నారు.